

రంజాన్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

పెద్దపల్లిరూరల్: రంజాన్ మాసం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ శ్రీహర్ష సమీక్షించారు.



అలరించిన సైన్స్‌ఫేర్

గోదావరిఖని: సెక్టార్‌–2 సింగరేణి పాఠశాలలో సైన్స్‌ఫేర్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రసంగాలు, ఆటాపాటలు, నాటికలు అలరించాయి. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
34.0/21.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. ఉదయం, రాత్రి వేళల్లో చలిగా ఉండి, మంచు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దర్జీల బతుకు దుర్భరం



సభ్యుడిని సత్కరిస్తున్న రాజయ్య తదితరులు

పెద్దపల్లిరూరల్: ఆధునిక పోకడలతో దర్జీల బతుకులు దుర్భరంగా మారాయని, పట్టెడన్నం కోసం పడరానిపాట్లు పడాల్సిన వస్తోందని మేరు సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి కీర్తి రాజయ్య మేరు ఆవేదన వ్యక్తం చేశారు. టైలర్స్‌డే సందర్భంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెడీమేడ్ దుస్తులు మార్కెట్‌లోకి రావడంతో దర్జీలకు కుట్టేపని కరువైందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో దర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. రాయితీ రుణాలిచ్చి ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సభ్యుడు శంకరయ్యను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మొలుగూరి అశోక్, రమేశ్, కీర్తి నవీన్, లింగయ్య, జితేందర్, నర్సింగం, రాపర్తి రమేశ్, శ్రీనివాస్, రవి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బూడిద టిప్పర్ల అడ్డగింత



టిప్పర్లను అడ్డుకుంటున్న వాహనదారులు

రామగుండం: మల్యాలపల్లి గ్రామ శివారులోని ఎన్టీపీసీ డ్యాంకు వెళ్లే రహదారిపై ద్విచక్రవాహనదారులు శుక్రవారం వేకువజామున బూడిద టిప్పర్లను అడ్డుకున్నారు. ఎల్కలపల్లి శివారులోని బూడిద చెరువు నిండిపోవడంతో టిప్పర్ల ద్వారా డ్యాంకు వెళ్లే రోడ్డు నుంచి రాజీవ్ రహదారికి టిప్పర్ల ద్వారా బూడిద తరలిస్తున్నారు. అయితే, డ్యాంలో సోలార్ ప్లేట్ల పర్యవేక్షణ చేసే సుమారు 120 మంది కార్మికులతోపాటు ఇటీవల నూతన ప్లాంట్‌లో విధులు నిర్వహించే 300 మంది కార్మికులు ఆందోళనకు దిగారు. బూడిద లోడుతో వందలాది టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండంతో బూడిద లేచి పడుతోందని, దీంతో తాము ప్రమాదాలకు గురవుతున్నామని కార్మికులు ఆరోపించారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ప్రమాదకరంగా గ్రిల్స్



ప్రమాదకరంగా ఉన్న గ్రిల్స్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయానికి వచ్చే ప్రధాన ముఖద్వారం గేటు ఎదుట ఏర్పాటు చేసిన పాత్‌వే గ్రిల్స్ ప్రమాదకరంగా మారాయి. గ్రిల్స్‌కు అమర్చిన పైపులు విరిగిపోవడంతో వాటి మధ్య ఎక్కువ గ్యాప్ వచ్చింది. దీనిని గమనించకుండా పైపులపై నుంచి నడుకుంటూ వెళ్లేవారు ఆ సందుల్లో పడి కాళ్లు విరిగిపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యానికి గతంలో కూడా చాలామంది బాధితులు గ్రిల్స్ మధ్య కాళ్లు ఇరుక్కుని కాళ్లు విరగొట్టుకున్నారు. పోలీసులు, స్థానికులు శ్రమించి గ్యాస్ కట్టర్‌తో పైపులను కట్‌చేసి బాధితులను రక్షించిన సంఘటనలు ఉన్నాయి. నిత్యం ఇదే గ్రిల్స్ పైనుంచి రాకపోకలు సాగిస్తున్న అధికారులు.. నివారణ చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా మరో ప్రమాదం చోటుచేసుకోకముందే స్పందించాల్సిన అవసరం ఉంది.

అందరూ హిందీ నేర్చుకోవాలి



బహుమతి అందుకుంటున్న టీచర్ శ్రీధర్

జ్యోతినగర్(రామగుండం): అందరూ హిందీ నేర్చుకోవాలని ఎన్టీపీసీ చీఫ్ జనరల్ మేనేజర్ చందన్ కుమార్ సావంత కోరారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో హిందీ దివస్ సందర్భంగా ఇటీవల పలు పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు శుక్రవారం ప్రాజెక్టు పరిపాలనా భవనంలో సీజీఎం ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఎన్టీపీసీ టీటీఎస్ జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు పెర్కారి శ్రీధర్‌రావుకు ప్రథమ బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా సీజీఎం మాట్లాడుతూ, ఉద్యోగులు, సిబ్బంది హిందీ భాష నేర్చుకోవడం ద్వారా విధి నిర్వహణలో సమన్వయం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (హెచ్‌ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్‌తోపాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

బోనస్ పడలే..

- సన్నవడ్లు విక్రయించిన రైతుల నిరీక్షణ
- రెండు నెలలైనా బ్యాంకు ఖాతాల్లో జమకాని డబ్బులు
- యాసంగి పెట్టుబడి కోసం అన్నదాతలకు తప్పని తిప్పలు



పెద్దపల్లి శివారులోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం క్రయ, విక్రయాలు(ఫైల్)

సాక్షి ప్రత్యేకం

జిల్లాలో సన్నరకం ధాన్యం సేకరణ వివరాలు

కొనుగోలు చేసిన ధాన్యం(మెట్రిక్ టన్నుల్లో)	2,29,443.96
విక్రయించిన రైతుల సంఖ్య	37,752
చెల్లించాల్సిన బోనస్ మొత్తం (రూ.కోట్లలో)	114.72
రైతుల ఖాతాల్లో జమైన సొమ్ము(రూ.కోట్లలో)	106.71
బోనస్ అందని రైతుల సంఖ్య	3,142
జమకావాల్సిన సొమ్ము(రూ.కోట్లలో)	8.01

సాక్షి, పెద్దపల్లి: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ధాన్యానికి మద్దతు ధర కల్పించడంతోపాటు అదనంగా రూ.500 బోనస్ వర్తింపజేస్తామనే ప్రకటన అప్పట్లో రైతుల్లో అనేక ఆశలు రేకెత్తించింది. ఇచ్చిన హామీ అమలులో భాగంగా గత వానాకాలం సీజన్‌లోనే సన్నవడ్లకు బోనస్ ఇస్తామని వెల్లడించింది. తన హామీ మేరకు వానాకాలం సీజన్‌లో సన్నవడ్లు క్వింటాలుకు రూ.2,320 మద్దతు ధరతోపాటు, రూ. 500 బోనస్ వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలో చాలామంది రైతులు సన్నరకం వడ్లు సాగు చేసేందుకే మొగ్గుచూపారు. అనేక వ్యయప్రయాసాలకు ఓర్చి సన్నవడ్లు పండించారు. ఆ తర్వాత బహిరంగ మార్కెట్‌లో సన్నవడ్లకు డిమాండ్ అధికంగా ఉన్నా.. తమకు బోనస్ లభిస్తుందనే ఆశతోనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే సన్నరకం వడ్లు విక్రయించారు. కానీ, సన్నరకం ధాన్యం విక్రయించిన నెలలు గడుస్తున్నా తమ బ్యాంకు ఖాతాల్లో బోనస్ డబ్బులు జమకాలేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బోనస్ డబ్బులు చేతికి అందితే యాసంగి పంటల సాగు పెట్టుబడిగా ఉపయోగపడుతుందని, ఇది తమకు ఎంతో ఆసరాగా ఉంటుందని ఆశపడుతున్నారు. అంతేకాదు.. బోనస్ డబ్బుల కోసం ప్రతీరోజు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరికొందరు బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడ్డాయో లేదోనని సరిచూసుకుంటున్నారు.

కష్టమైనా సన్నవడ్లే సాగు చేశారు..

జిల్లాలో గత వానాకాలంలో సుమారు 1.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 321 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దొడ్డురకం కన్నా.. సన్నరకం వడ్లు సాగు చేయడానికి కష్టాలు ఎక్కువే. సహజంగా దొడ్డురకం పంట కాలం 135 రోజుల వరకు ఉంటే, సన్నవడ్లు 165 రోజుల వరకు ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఫలితంగా నెలరోజుల పాటు రైతులు అదనంగా శ్రమించాల్సి వస్తోంది. పెట్టుబడి సైతం సాధారణ రకాలతో పోల్చి చూస్తే సుమారు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు అధికమవుతోంది. చీడపీడలు సోకే ప్రమాదం కూడా ఎక్కువే ఉన్నా.. ఆ మేరకు రావాల్సిన దిగుబడి.. తక్కువగా రావడం రైతులను ఇబ్బందులకు గురిచేసే అంశమేనని పేర్కొంటున్నారు. అయినా, వ్యయప్రయాసాలకు ఓర్చి సన్నాలు సాగు చేసి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. కానీ, సుమారు రెండున్నర నెలలు గడిచినా బోనస్ డబ్బులు పడక చాలా మంది రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదేవిషయమైన సివిల్ సప్లయి డీఎం శ్రీకాంత్‌రెడ్డిని వివరణ కోరగా.. రైతుల వివరాల జాబితాను ప్రభుత్వానికి పంపించామన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతాయని ఆయన వెల్లడించారు.

డిసెంబర్‌లో అమ్మిన



గత డిసెంబర్‌లో మా గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో సన్నవడ్లను విక్రయించా. 112 బస్తాల ధాన్యం అమ్మిన. వాటికి సంబంధించిన మద్దతు ధర డబ్బులు నా బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. కానీ, క్వింటాలుకు ఇస్తానన్న రూ.500 బోనస్ డబ్బులు ఇప్పటి వరకు బ్యాంకు ఖాతాలో పడలేదు. బోనస్ దాదాపు రూ.22,500 జమకావాల్సి ఉంది.

– దారవేణి శ్రీనివాస్, రైతు, పాలకుర్తి

వ్యాపారులకు విక్రయించలే

మా ఊరిలోని కొనుగోలు కేంద్రంలో రెండు నెలల క్రితం జైశ్రీరామ్ సన్నవడ్లు విక్రయించిన. బోనస్ పైసలు క్వింటాలుకు రూ.500 ఇస్తున్నారని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్మిన. బయట మార్కెట్‌లో క్వింటాలుకు రూ.2,800 చొప్పున ధర చెల్లిస్తామని వ్యాపారులు చెప్పినా నేను అమ్మలేదు. తీరా చూస్తే సన్నవడ్లకు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బోనస్ పడలేదు.

– దాడి సదయ్య, రైతు దొంగతుర్తి

వివాహాల నమోదు అంతంతే..

- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే అధికంగా నమోదు
- గ్రామపంచాయతీల్లో ఉచితమైనా మొగ్గుచూపని వైనం



గర్రెపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వివాహాల నమోదు ప్రక్రియ అంతంత మాత్రంగానే సాగుతోంది. వివాహాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తున్నా.. పల్లెవాసులు అటువైపు పెద్దగా మొగ్గుచూపడం లేదు. అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడమే కారణమనే విమర్శలు వస్తున్నాయి. ఇదేసమయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంల్లో అత్యధికంగా వివాహాలు నమోదు కావడం గమనార్హం.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు..

గ్రామాల్లో బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం 2002లో వివాహ నమోదు చట్టంలో జీవో నంబరు 193 ప్రకారం కొన్ని వెసులుబాట్లు కల్పించింది. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వివాహ నమోదు బాధ్యతను పంచాయతీ కార్యదర్శులకు అప్పగిస్తూ ఉత్వర్వులు జారీచేసింది. అంతేగాకుండా ఈ చట్టం నిబంధనల ప్రకారం యువతికి 18 ఏళ్లు, యువకుడికి 21ఏళ్ల వయసు నిండి తర్వాతే వివాహం చేయాలి. పెళ్లికి ముందు తప్పనిసరిగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో పేర్లు నమోదు చేయాలి. దీంతో బాల్య వివాహాలను ముందస్తుగానే అధికారులు అడ్డుకునే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

గ్రామాల్లో 54..
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 650

సుల్తానాబాద్ మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే, 2024 జనవరి నుంచి 2025 ఫిబ్రవరి వరకు దాదాపు 13 నెలల్లో 54 వివాహాలు నమోదు అయ్యాయి. సుల్తానాబాద్‌లో ఒక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉంది. దీని పరిధిలో సుల్తానాబాద్, జూలపల్లి, ధర్మారం, ఎలిగేడు మండలాలు వస్తాయి. ఈ మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో కలిపి ఇప్పటివరకు 650 వివాహాల రిజిస్ట్రేషన్లు జరిగినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఇలా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎక్కువ సంఖ్యలో వివాహాల రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా.. ఉచితంగా నమోదు చేసే గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉండడం విస్మయం కలిగిస్తోంది.

ఉచితంగా నమోదు



గ్రామపంచాయతీ కార్యాలయల్లో నిర్ణీత సమయంలో వివాహాలు నమోదు చేసుకుంటే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తాం. గ్రామీణ దంపతులు ఎక్కడకు వెళ్లకుండా గ్రామపంచాయతీ కార్యాలయాల్లోనే ఉచితంగా వివాహాలు నమోదు చేసుకునే అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోండి.

– సమ్మిరెడ్డి, ఎంపీవో, సుల్తానాబాద్

విధుల్లో సాటి.. క్రీడల్లో మేటి

- క్రీడా పోటీల్లో పోలీసుల ప్రతిభ
- జాతీయస్థాయికి ఎంపిక



పతకాలు సాధించిన వారిని అభినందిస్తున్న సీపీ

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలువురు పోలీసు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోలీస్ మీట్‌లో సత్తాచాటి రాష్ట్రం తరఫున జాతీయస్థాయి పోలీస్‌మీట్‌కి అర్హత సాధించారు. తీరక లేకుండా విధులు నిర్వర్తిస్తూనే క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. రాష్ట్రస్థాయి పోలీసు క్రీడా పోటీలు కరీంనగర్ జిల్లా కేంద్రంలో జనవరి–28 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు జరిగాయి. రామగుండం కమిషనరేట్ పోలీసులు ఇందులో సత్తా చాటారు. ఏఆర్ ఏసీపీ సి.ప్రతాప్ ఆధ్వర్యంలో క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటారు. మార్చి 7 నుంచి జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈసారి కాళేశ్వరం జోన్‌లో అత్యధిక మెడల్స్ సాధించి ముందంజలో నిలిచారు. మొత్తం 48 మెడల్స్ రాగా గోల్డ్‌మెడల్స్–11, సిల్వర్ మెడల్స్–15, బ్రాంజ్ మెడల్స్–21, ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన పోలీసు క్రీడాకారులను పలువురు అభినందించారు.

ఆర్చరీ అంటే ఇష్టం



ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనబోతున్నా. 50 మీటర్ల రికర్వ్ విభాగంలో రజతం, 70 మీటర్ల వ్యక్తిగత రికర్వ్ విభాగంలో వెండి, 30 మీటర్ల విభాగంలో రజత పతకాలు సాధించా. జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరగనున్నాయి. గోల్డ్‌మెడల్ సాధించాలనే తపన ఉంది.

– సంపత్‌కుమార్, ఎంటీవో, ఆర్ఐ

వాలీబాల్ పోటీలకు ఎంపిక



వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్‌మెడల్ సాధించి జాతీయస్థాయి మహిళా విభాగం పోటీలకు ఎంపికయ్యా. మార్చి 7 నుంచి 11 వరకు మధుబాన్, కర్నాల్, హరియాణాలో జాతీయ స్థాయి పోలీస్‌మీట్ జరగనుంది. దీనిలో కూడా ప్రతి కనబర్చి బంగారు పతకం సాధించాలని ఉంది. ప్రత్యేక క్యాంపు ద్వారా శిక్షణ అందిస్తున్నారు. జూనియర్ నేషనల్స్, యూత్ నేషనల్ యూనివర్సిటీ స్థాయిలో ఆడిన అనుభవం ఉంది.

– ఎల్.సరోజ, కానిస్టేబుల్, బెల్లంపల్లివన్‌టౌన్

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొస్తాం
- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ఆర్‌ఎఫ్‌సీఎల్‌లోని కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు నెలకంటి రాముతో కలిసి కార్మికుల సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్‌ఎఫ్‌సీఎల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ఢిల్లీలో ఉన్న ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్యాలయానికి వెళ్లి అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. శ్రమకు తగిన వేతనాలు అందజేయాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం రావాల్సిన అలవెన్స్‌లు చెల్లించాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులపై పని భారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టబోయిన రాజ్‌కుమార్, కందుల సతీశ్, శంకర్, మల్లేశ్, రమేశ్‌రెడ్డి, ఎరుకల అంజి, దాత శ్రీనివాస్, దూస రాజేశ్, జనగామ శ్రీనాథ్, కుమార్, శ్రీనివాస్, తరుణ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు టీచర్లకు దరఖాస్తులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిన టీచర్లు, కోచ్(గేమ్స్, మ్యూజిక్, డ్యాన్స్) నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శోభన్‌బాబు శుక్రవారం తెలిపారు. అర్హత, ఆసక్తి గలఅభ్యర్థులు ఈనెల 4, 5వ తేదీల్లో కేంద్రీయ విద్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. ఉదయం 8.30 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందని, అభ్యర్థులు విద్యార్హతల ధ్రువీకరణపత్రాలతోపాటు ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో వెంట తీసుకుని రావాలని సూచించారు. వివరాలకు విద్యాలయ వెబ్‌సైట్ (ramagundamntpc.kvs.ac.in)లో సంప్రదించాలని ఆయన కోరారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 5 నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా అనుమతించరు
- మొత్తం విద్యార్థులు 10,985 మంది
- కేటాయించిన పరీక్ష కేంద్రాలు 23
- 290 మంది ఇన్విజిలేటర్ల నియామకం



ఇంటర్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు ఇంటర్ విద్యాశాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. గతంలో మాదిరిగా ఈసారి కూడా ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించబోమని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పరీక్ష సమయానికి ఒకగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఈనెల 5 నుంచి 25వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షలు సజావుగా సాగేందుకు వైద్య, పోలీసులు, రెవెన్యూ, విద్యుత్, ఆర్టీసీ, పురపాలక, తపాలా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఆదేశించారు.

జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలు

ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 25 మంది పర్యవేక్షకులు, 25 మంది అదనపు పర్యవేక్షకులు, ఒక ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్‌తోపాటు 400 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 10,985 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని ఇంటర్ విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రశ్నాపత్రాలను తెరిచే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు బిగిస్తున్నామని పేర్కొన్నారు.

సెంటర్ లొకేటర్ యాప్..

గతంలో పరీక్ష కేంద్రాల చిరునామా తెలుసుకోవడం విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈసారి వాటిగుర్తింపు కోసం లొకేటర్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. అభ్యర్థులు ఇక సులువుగా పరీక్ష కేంద్రాలను గుర్తించేందుకు వీలుంటుందని అధికారులు తెలిపారు. హాల్‌టికెట్ల జారీలో ప్రైవేట్ కళాశాలలు పెట్టే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెబ్‌సైట్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు.

ఇంటర్ విద్యార్థులు 10,985 మంది..

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో మొత్తం 10,985 మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. ఇందులో మొదటి సంవత్సరంలో 5,844 మంది, ద్వితీయ సంవత్సరంలో 5,141 మంది ఉన్నారు. వీరికి పరీక్షలు నిర్వహించేందుకు 400 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఇప్పటికే ప్రాక్టికల్ పరీక్షలు పూర్తికావడంతో ఇక వార్షిక పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం..

గురుకుల, మోడల్ స్కూల్, మైనార్టీ వెల్ఫేర్ పాఠశాలలకు పరీక్ష కేంద్రాలు దూరం ఉంటే సంబంధిత విద్యార్థులు సమీపంలో ఉన్న పరీక్ష కేంద్రానికి ఆర్టీసీ బస్సుల ద్వారా ఉచితంగా అప్ అండ్ డౌన్ చేరవేసే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

144 సెక్షన్ అమలు..

జిల్లాలోని పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ప్రశ్నాపత్రాలు చేరగా.. వాటిని సమీప పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచినట్లు అధికారులు తెలిపారు. పరీక్షల సమయంలో బుక్‌స్టాల్స్, జిరాక్స్ సెంటర్లను మూసివేస్తామని అధికారులు ఇప్పటికే వెల్లడించారు.

అందుబాటులో వైద్య సిబ్బంది..

ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సిబ్బందిని అందుబాటులో ఉంచుతారు. ఇందుకోసం ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, సూపర్‌వైజర్లకు విధులు కేటాయించారు. ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచుతారు. అవసరమైన మందులు కూడా నిల్వచేస్తారు.

సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శుక్రవారం అధికారులతో కలెక్టర్ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ నెల 5 నుంచి 25వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థుల కోసం జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, పరీక్ష సమయాల్లో విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులు నడిపించాలని ఆదేశించారు. ఇంటర్ విద్య నోడల్ అధికారి కల్పన, అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు



జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షలకు అనుమతించరు. హాల్‌టికెట్ల జారీ విషయంలో ఇబ్బందులకు గురిచేసే కళాశాలపై ఫిర్యాదు వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– కల్పన, జిల్లా ఇంటర్ విద్య నోడల్ ఆఫీసర్

సమస్యలు పరిష్కరిస్తాం



నాయకులతో మిర్యాల రాజిరెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ(పెద్దపల్లి): సింగరేణి బొగ్గుగని కార్మికుల సమస్యలను పరిష్కరించిన ఘనత టీబీజీకేఎస్‌కే దక్కిందని ఆ యూనియన్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి అన్నారు. యూనియ ఏఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ యూనియన్లకు చెందిన నాయకులు టీబీజీకేస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి రాజిరెడ్డి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 70కిపైగా కార్మిక హక్కులు సాధించడంతోపాటు కోల్ ఇండియాలో లేనివిధంగా 18 అదనపు హక్కులను సాధించినట్లు పేర్కొన్నారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, చంద్రయ్య, సురేందర్, రవితేజ, వెంకటేశ్, శ్రీనివాస్, రమేశ్, తిరుపతి, రామ్‌చరణ్, లేనిన్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అప్పన్నపేట జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం

పెద్దపల్లిరూరల్: అప్పన్నపేట జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం శుక్రవారం తెలిపారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా విద్యాధికారి మాధవితోపాటు విద్యాశాఖకు చెందిన పలువురు అధికారులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం



ప్రవీణ్ (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఆర్థిక ఇబ్బందులతో తంగళ్లపల్లి మండలంలోని కేసీఆర్‌నగర్‌కు చెందిన గరిక ప్రవీణ్(25) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ప్రవీణ్ పేయింటర్‌గా పని చేసేవాడు. కొంతకాలంగా చేతినిండా పనిలేక పోవడంతో సిరిసిల్లలోని ఓ కిరాణా షాపులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య గాయత్రి, కుమారుడు గౌతమ్, కూతురు నిఖిత ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఒకరి ఆత్మహత్య



రాజ్‌కుమార్ (ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన ముచ్చుకుర్తి రాజ్‌కుమార్ (32) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ముచ్చుకుర్తి జనార్దన్‌కు ఇద్దరు కుమారులున్నారు. చిన్న కొడుకు రాజ్‌కుమార్(32)కు నాలుగేళ్ల క్రితం వివాహం కాగా, 8 నెలల కిత్రం భార్యతో మనస్పర్థలు వచ్చి, విడాకులు తీసుకున్నాడు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై, జీవితంపై విరక్తితో శుక్రవారం తెల్లవారుజామున గ్రామ శివారులోని ఎల్లమ్మ చెరువు సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుంభమేళాకు వెళ్లొస్తుండగా రోడ్డు ప్రమాదం

- 9 మందికి గాయాలు

మంథని: ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాకు వెళ్లొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో 9 మందికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. మంథనికి చెందిన మిరాల సాగర్, రామగిరి మండలం నాగెపల్లికి చెందిన నేరెళ్ల విజయ్, మరో ఏడుగురు గత సోమవారం మహాకుంభమేళాకు వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరిగి వస్తుండగా వారి వాహనం చెట్టును ఢీకొట్టింది. గాయపడినవారిని తొలుత కౌశంబి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రయాగరాజ్ జిల్లా స్వరూప్‌రాణి మెడికల్ కళాశాలకు తీసుకెళ్లి, చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల కుటుంబసభ్యులు అక్కడికి బయలుదేరి వెళ్లారు.

కుక్కల దాడిలో మేక పిల్లలు మృతి



గంభీరావుపేట(సిరిసిల్ల): నర్మాల గ్రామంలో ఓరుగంటి వెంకటికి చెందిన మేక పిల్లలపై శుక్రవారం కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో 13 జీవాలు మృతి చెందాయి. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

పసుపు ధర పతనం

- గతేడాది క్వింటాల్‌కు రూ.17 వేల నుంచి రూ.18 వేలు
- ఇప్పుడు రూ.8 వేల నుంచి రూ.10 వేలే..
- ఆందోళనలో పసుపు రైతులు



మార్కెట్‌కు వచ్చిన పసుపు

జగిత్యాలఅగ్రికల్చర్: వాణిజ్య పంట అయిన పసుపు పంటకు జగిత్యాల జిల్లా పెట్టింది పేరు. జూన్, జూలై నెలల్లో సాగు చేసిన పంటను ప్రస్తుతం తవ్వి, ఉడుకబెట్టి, మార్కెట్‌కు తరలిస్తున్నారు. అయితే, మార్కెట్‌లో పలికే ధరలు చూసి రైతులు గగ్గోలు పెడుతున్నారు. పసుపు బోర్డు ఏర్పాటు తర్వాత ధరల్లో చలనం వస్తుందనుకుంటే, గతేడాది పలికిన ధరలు కూడా ప్రస్తుతం పలకడం లేదని వాపోతున్నారు.

☛ **మెట్‌పల్లి, నిజామాబాద్‌కు తరలింపు**

రైతులు పండించిన పసుపును అమ్ముకునేందుకు మెట్‌పల్లి, జగిత్యాలతో పాటు నిజామాబాద్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. గతేడాది ఓపెన్ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.17 వేల నుంచి రూ.18 వేలు ధర పలుకగా రైతులు సంతోషించారు. దీనికి తోడు పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటనతో ఎగుమతులు పెరుగుతాయని ఈ ఏడాది అదనంగా మరో 10 వేల ఎకరాల వరకు సాగు చేశారు. అయితే, పసుపు పంటను మార్కెట్‌కు తీసుకెళ్లిన తర్వాత వ్యాపారస్తులు నిర్ణయించే ధరలు చూసి వాపోతున్నారు. ప్రస్తుతం నిజామాబాద్, మెట్‌పల్లి మార్కెట్‌లలో క్వింటాల్‌కు రూ.8 వేల నుంచి రూ.10 వేల ధరలు మాత్రమే పలుకుతున్నాయి.

☛ **వ్యాపారులు చెప్పిందే రేటు**

జగిత్యాల జిల్లాలో దాదాపు 45 వేల ఎకరాల్లో పసుపు సాగవుతుండగా, 7–8 లక్షల క్వింటాళ్ల పంట ఉత్పత్తి అవుతుంది. ఒకప్పుడు బంగారంతో పోటీపడిన పసుపు పంట, ఇప్పుడు చతికిల పడిపోయి రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి దాపురించింది. ఏటా మార్కెట్‌లో ధరలు హెచ్చుతగ్గులకు లోనవడం, రైతులు మార్కెట్‌కు వెళ్లే వరకు ఏ రేటు వస్తుందో తెలియని దుస్థితి నెలకొంది. రైతులు పోటీపడి దిగుబడులు తీస్తున్నా మార్కెటింగ్ సమయంలో సరైన ధర రాక డీలాపడుతున్నారు. వరి, మొక్కజొన్న మాదిరిగా పసుపు పంటకు మద్దతు ధర ప్రకటించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు.

☛ **పెరుగుతున్న పెట్టుబడి**

పసుపు ఏడాది పంట. దాదాపు 9–10 నెలల పాటు భూమిలో ఉంటుంది. పంటకాలంలో అన్ని ఖర్చులు కలుపుకుంటే ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు వస్తుంది. పసుపు పంట ఒక్కో ఎకరాకు కనీసం లారీ కోడి ఎరువు వేస్తుంటారు. దాని ధర రూ.25 వేల వరకు వెళ్లింది. ఎకరం పసుపు తవ్వేందుకు కూలీలకు రూ.25వేల నుంచి రూ.30 వేలు, ఉడకబెట్టి, ఆరబెట్టి, మార్కెట్‌కు తరలించేందుకు మరో రూ.15 వేల ఖర్చు వస్తుంది. దీంతో పాటు ఎరువులు, విత్తనం, ట్రాక్టర్‌తో దున్నేందుకు, కలుపు ఇలా మరో రూ.25 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇంతా ఖర్చు చేసి పంట పండిస్తే ఎకరాకు కనీసం రూ.లక్ష కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు, ఈసారి అధిక వర్షాలతో పంటకు రోగాలు సోకి దిగుబడులు పడిపోయాయి.

☛ **నిల్వ చేసే పరిస్థితులు లేక..**

రైతులు పంటను ఇళ్లలో నిల్వ చేసే పరిస్థితి లేకపోవడం, నిల్వ చేస్తే పురుగులు ఆశించి నష్టం చేస్తుండటంతో ఏదో ఓ రేటుకు అమ్మేస్తున్నారు. పసుపు ఒక్కసారిగా మార్కెట్‌కు వస్తున్న సమయంలో వ్యాపారులు రేట్లు తగ్గిస్తున్నారు. పసుపు నిల్వ చేయాలంటే కోల్డ్ స్టోరేజీలు అవసరం. కానీ, జిల్లాలో ఒకట్రెండు ప్రైవేట్ కోల్డ్ స్టోరేజీలు ఉండగా, వ్యాపారస్తులు తక్కువ రేటుకు కొనుగోలు చేసిన పంటను వాటిలో నిల్వ చేసి, ధర వచ్చినప్పుడు సాంగ్లీ వంటి పెద్ద మార్కెట్లలో అమ్ముకుంటున్నారు.

☛ **పసుపు బోర్డు రంగంలోకి దిగితేనే..**

రైతుల పోరాటాలతో నిజామాబాద్ కేంద్రంగా పసుపు బోర్డు ఏర్పడినా ఇంకా రంగంలోకి దిగలేదు. దీంతో ఎప్పటి మాదిరిగానే రైతులు పసుపును వ్యాపారులు పెట్టిన రేటుకు అమ్ముకుంటున్నారు. ఇతర దేశాలకు ఎగుమతులు లేవంటూ, పంట బాగా వచ్చినందునే రేటు తగ్గిందంటూ వ్యాపారులు కుంటిసాకులు చెబుతున్నారు. అన్ని ఉత్పత్తుల రేట్లు పెరిగినట్టుగానే పసుపు క్వింటాల్‌కు కనీసం రూ.15 వేలు చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కనీస ధర చెల్లించాలి



గతేడాది పసుపు పంటకు ధర ఉందని ఈసారి అధికంగా సాగు చేస్తే ఇప్పుడు ధర లేదు. పసుపుబోర్డు రంగంలోకి దిగి రైతులను ఆదుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి క్వింటాల్‌కు రూ.15 వేలు ఇవ్వాలి.

– కోల నారాయణ, పసుపు రైతు, చల్‌గల్

దిగుబడులు అంతంతే..



ఈ సారి వర్షాలతో పసుపు పంటలో అనుకున్న స్థాయిలో దిగుబడులు రావడం లేదు. ఎకరాకు 20 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్లకు పడిపోయింది. రేటు కూడా పడిపోయింది. రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాకుంటే ఎలా బతుకుతారు.

– క్యాతం సాయిరెడ్డి, సింగరావుపేట

బస్సును ఢీకొన్న మరో బస్సు



కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోలింగ్ సిబ్బంది

- ఇద్దరికి తీవ్ర, ఎన్నికల సిబ్బందికి స్వల్ప గాయాలు
- బస్సులు నిర్మల్, భైంసా డిపోలకు చెందినవి



ధ్వంసమైన ఆర్టీసీ బస్సు

గంగాధర: ఆర్టీసీకి చెందిన ఓ బస్సును మరో బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర, ఎన్నికల సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లాలో గురువారం నిర్వహించిన పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను సిబ్బంది భైంసా డిపో, నిర్మల్ డిపోకు చెందిన రెండు బస్సుల్లో కరీంనగర్‌లోని స్ట్రాంగ్‌రూంకు తీసుకువచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున తిరిగి వెళ్తున్నారు. కొడిమ్యాల మండలంలోని నమిలికొండ, గంగాధర మండలంలోని మంగపేట సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద స్పీడ్ బ్రేకర్ కారణంగా ముందు వెళ్తున్న నిర్మల్ డిపో బస్సు వేగం తగ్గింది. దీంతో వెనక వస్తున్న భైంసా డిపో బస్సు దాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భైంసా డిపో బస్సు డ్రైవర్ మొయినొద్దీన్ కాలు విరగగా, పురుషోత్తం అనే వ్యక్తి ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఎన్నికల సిబ్బంది ప్రణయ్, ప్రియాంక, గంగాధర్, ముత్తన్న, రాజలింగం, స్వరూప, సూరజ్‌కుమార్, ప్రసిల్లా, ఎస్కే.రఫీ, ఎస్కే.అజీజ్, విక్రమ్, పృథ్వీ, ఎస్.అశోక్, పి.అభిలాష్, ఎ.రవి, సి.విక్రమ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. రైల్వే గేట్‌మ్యాన్ ప్రదీప్ సమాచారంతో కొడిమ్యాల పోలీసులు, గంగాధర బ్లూకోల్ట్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని, బాధితులను కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి హరికృష్ణ

బాధితులకు పరామర్శ

కరీంనగర్‌టౌన్: ఆర్టీసీ బస్సును మరో బస్సు ఢీకొన్న ప్రమాదంలో గాయపడి, కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ పరామర్శించారు. ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

కడుపులోనే శిశువు.. కాసేపటికే తల్లి

- ఇద్దరూ మృతి
- పల్లిమక్త, కొండాపూర్‌లలో విషాదం



లాస్య (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): ఓ గర్భిణిని ప్రసవం కోసం ఆస్పత్రికి తీసుకెళ్తే.. శిశువు కడుపులోనే చనిపోగా.. పరిస్థితి విషమించి, కాసేపటికే తల్లి మృతిచెందింది. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామానికి చెంది సిద్దరవేణి బాబుకు కొండాపూర్ గ్రామానికి చెందిన లాస్యతో ఏడాది క్రితం వివాహం జరిగింది. గర్భిణి అయిన లాస్యను కుటుంబసభ్యులు ప్రసవం నిమిత్తం గురువారం వేములవాడ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్య సిబ్బంది ఇంజక్షన్ వేయడంతో ఆమెకు ఫిట్స్ వచ్చాయి. దీంతో వారు ఆందోళనకు గురై, కరీంనగర్ తీసుకెళ్లాలని సూచించారు. బాధితులు సిరిసిల్ల ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు కరీంనగర్ వెళ్లాలని చెప్పడంతో వెంటనే అక్కడికి తీసుకెళ్లారు. వైద్యులు లాస్య పరిస్థితి విషమంగా ఉందని చెప్పి, హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి పంపించారు. శుక్రవారం తెల్లవారుజామున అక్కడికి చేరుకోగా వైద్యులు ఆపరేషన్ చేసి, మృత శిశువును బయటకు తీశారు. పరిస్థితి విషమించడంతో కాసేపటికే తల్లి లాస్య కూడా మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో పల్లిమక్త, కొండాపూర్‌లలో విషాదం నెలకొంది.

సౌదీ అరేబియాలో పోసానిపేటవాసి హత్య



హన్మంతు (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): ఓ వలసజీవి సౌదీ అరేబియాలో హత్యకు గురయ్యాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. కథలాపూర్ మండలంలోని పోసానిపేటకు చెందిన గుంట హన్మంతు(42) ఉపాధి నిమిత్తం కొన్నేళ్లుగా సౌదీ అరేబియా వెళ్తున్నాడు. అక్కడ తాను ఉంటున్న గదిలో నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తితో గొడవ జరిగింది. దీంతో అవతలి వ్యక్తి కత్తితో దాడి చేయడంతో హన్మంతు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయమై అక్కడివారు మృతుడి కుటుంబసభ్యులకు శుక్రవారం రాత్రి ఫోన్‌లో సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. హన్మంతు హత్య విషయమై సౌదీలోని పలువురిని వాకబు చేసినట్లు మాజీ సర్పంచ్ గంగారెడ్డి తెలిపారు.

ఉపాధి వేటలో ఆగిన ఊపిరి

- సౌదీలో గుండెపోటుతో రేగుంటవాసి మృతి



గణేశ్ (ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): ఉన్న ఊరిలో ఉపాధి కరువై, కుటుంబాన్ని వదిలి ఏడారి దేశానికి వెళ్లిన ఓ వలసజీవి అక్కడే మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మల్లాపూర్ మండలంలోని రేగుంటకు చెందిన కర్న గణేశ్(55)కు భార్య రాజేశ్వరి, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. గణేశ్ ఉపాధి నిమిత్తం కొన్నేళ్లుగా సౌదీ అరేబియా వెళ్తున్నాడు. అక్కడ దర్జీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కూతుళ్లకు వివాహాలు జరిపించాడు. కొంత అప్పు ఉండటంతో ఇటీవలే సౌదీ వెళ్లాడు. రెండు రోజుల క్రితం గుండె పోటు రావడంతో మృతిచెందాడు. అతని వెంట ఉన్నవారు ఈ విషయాన్ని శుక్రవారం ఫోన్‌లో తెలుపడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గణేశ్ మృతదేహం స్వగ్రామం చేరేలా చూడాలని, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

- 6 నెలలుగా విధులు కేటాయించకపోవడమే కారణం



బాధితుడు సురేశ్

విద్యానగర్(కరీంనగర్): తనకు విధులు కేటాయించడం లేదని మనస్తాపానికి గురైన ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడి వివరాల ప్రకారం.. చొప్పదండి మండలంలోని చాకుంటకు చెందిన సురేశ్ ఆర్టీసీ కరీంనగర్–1 డిపోలో అద్దె బస్సు డ్రైవర్‌గా పని చేసేవాడు. గత సెప్టెంబర్‌లో మద్యం సేవించి, టెస్టింగ్‌లో దొరికిపోయాడు. దీంతో అధికారులు అతన్ని పక్కన పెట్టారు. 6 నెలలు గడిచినా విధులు కేటాయించకపోవడంతో సురేశ్ మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం డిపో ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది అతన్ని అడ్డుకొని, పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై వారు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఉండే గుర్తు తెలియని వృద్ధుడు శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. అతని వయసు 65 ఏళ్ల వరకు ఉంటుందని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలు తెలిసిన వారు కరీంనగర్ టూటౌన్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

అప్పు తీసుకున్నవారు ఇవ్వడం లేదని..

- మడిపల్లిలో యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): అప్పు తీసుకున్నవారు తిరిగి ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ప్రాణం తీసుకున్నాడు. సీఐ రవి వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని మడిపల్లికి చెందిన సాన శ్రీకాంత్(36) జమ్మికుంటలో నివాసం ఉంటున్నాడు. తన వద్ద ఉన్న డబ్బులను కొంత మందికి అప్పుగా ఇచ్చాడు. వారు తిరిగి ఇవ్వడం లేదు. ఈ విషయమై పలుమార్లు భార్యతో చర్చిస్తూ ఆవేదన చెందేవాడు. ఆ డబ్బులు వస్తాయో రావో అని మనస్తాపానికి గురై, శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య స్వాతి, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అత్తపై అల్లుడి దాడి

- విరిగిన బాధితురాలి కాలు

జమ్మికుంట(హుజూరాబాద్): అత్తపై అల్లుడు దాడికి పాల్పడిన ఘటన జమ్మికుంట మండలంలోని వావిలాల గ్రామంలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ రవి కథనం ప్రకారం.. వావిలాల గ్రామానికి చెందిన నాగెల్లి వనజకు ఓదెల మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన ఎలకపల్లి రాజశేఖర్‌తో వివాహం జరిగింది. దంపతుల మధ్య గొడవల కారణంగా ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. రాజశేఖర్ శుక్రవారం అత్తగారింటికి వచ్చాడు. తన భార్యను ఎందుకు కాపురానికి పంపించడం లేదంటూ అత్త శోభపై కర్రతో దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె కాలు విరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మానేరులో ఈతకు వెళ్లి.. నీటమునిగి

- ఆర్టీసీ డ్రైవర్ మృతి

కొత్తపల్లి(కరీంనగర్): మానేరు జలాశయంలో ఈతకు వెళ్లిన ఆర్టీసీ డ్రైవర్ నీటమునిగి మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని అల్కాపురి కాలనీకి చెందిన కటారి తిరుపతిరావుకు కోరుట్ల డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ప్రతీరోజు మానేరు జలాశయం సమీపంలో వాకింగ్ చేసి, అందులో ఈత కొట్టడం అలవాటు. శుక్రవారం ఉదయం కూడా వాకింగ్ తర్వాత డ్యాంలో దిగాడు. ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతని కోసం గాలించగా మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో 6 నెలల జైలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చెక్ బౌన్స్ కేసులో ఒకరికి ఆరు నెలల జైలు, అప్పుగా తీసుకున్న మొత్తం వెంటనే చెల్లించాలని సిరిసిల్ల ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సృజన శుక్రవారం తీర్పు ఇచ్చారు. ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రాగుల బాల్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన నంది కిషన్ వద్ద రూ.5లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించేందుకు ఇచ్చిన రెండు చెక్కులు బౌన్స్ కావడంతో బాధితుడు కిషన్ కోర్టును ఆశ్రయించాడు. కేసును విచారించిన న్యాయమూర్తి నేరం రుజువుకావడంతో బాల్‌రెడ్డికి ఆరు నెలల జైలుతోపాటు వెంటనే కిషన్‌కు రూ.5లక్షలు చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

చిన్నారి మృతి కేసులో ఆటోడ్రైవర్‌కు..

గంభీరావుపేట(సిరిసిల్ల): అతివేగంగా ఆటో నడిపి, ఏడేళ్ల చిన్నారి మృతికి కారణమైన ఆటోడ్రైవర్‌కు 6 నెలల జైలుశిక్షతోపాటు రూ.4,100 జరిమానా విధిస్తూ సిరిసిల్ల అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కావేటి సృజన తీర్పు చెప్పారని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన గుగులోతు సంజన 29 జూన్ 2016న ఇంటి ఎదుట నిల్చొని ఉండగా.. గంభీరావుపేటకు చెందిన ఆటోడ్రైవర్ లింగంపల్లి శ్రీనివాస్ ఆటోను అతివేగంగా నడుపుతూ వచ్చి, ఢీకొట్టాడు. పాప అక్కడికక్కడే మృతిచెందింది. ఈ కేసులో నేరం రుజువు కావడంతో శ్రీనివాస్‌కు జడ్జి శుక్రవారం శిక్ష ఖరారు చేశారని ఎస్సై పేర్కొన్నారు.

కత్తితో దాడి.. ఇద్దరికి గాయాలు

కోరుట్ల: కత్తితో దాడి ఘటనలో అన్నదమ్ములకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణానికి చెందిన సోదరులు ముత్యాల సుమంత్, రేవంత్ స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో సెలూన్ నిర్వహిస్తున్నారు. వీరి షాపు ఎదుట రాజస్థాన్‌కు చెందిన ప్రేమ్ అనే యువకుడు పానీపూరి బండి నడిపిస్తున్నాడు. పానీపూరి బండి తమ షాపు ముందే ఉండటంతో లోపలికి వెళ్లేందుకు ఇబ్బంది అవుతోందని, దూరంగా పెట్టుకోవాలని శుక్రవారం సాయంత్రం అతనికి సూచించారు. ఈ విషయమై ముగ్గురి మధ్య మాటామాట పెరిగింది. దీంతో రేవంత్, సుమంత్‌లపై ప్రేమ్ కత్తితో దాడి చేయగా వారు గాయపడ్డారు. బాధితులను స్థానికులు జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రేమ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కార్మికుడి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌కు చెందిన ఒల్లెపు దేవరాజు అనే వడ్డెర కార్మికుడి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ శుక్రవారం తెలిపారు. రెండు రోజుల క్రితం ఎల్లం తన వ్యవసాయ బావిలో పూడిక తీయించేందుకు దేవరాజును తీసుకెళ్లాడన్నారు. పనులు చేస్తుండగా అతను విద్యుదాఘాతంతో మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎల్లంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల రగుడు కలెక్టరేట్ సర్కిల్ వద్ద శుక్రవారం ఆటో, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న నాగయ్య, కవిత, గీత, ఋషిలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులకు సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

కుక్కల దాడిలో బాలుడికి...

కథలాపూర్(వేములవాడ): కుక్కల దాడిలో ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం.. కథలాపూర్ మండలంలోని సిరికొండకు చెందిన కందరి శ్రీయాన్ష్ అనే మూడేళ్ల బాలుడు శుక్రవారం సాయంత్రం ఇంటి ఎదుట ఆడుకుంటున్నాడు. అక్కడికి వచ్చిన కుక్కలు ఒక్కసారిగా ఆ బాలుడిపై దాడి చేశాయి. ఈ ఘటనలో శ్రీయాన్ష్ మెడపై తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు ఆ చిన్నారిని తొలుత కోరుట్ల ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

రాజన్న ఆదాయం రూ.1.31కోట్లు



రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబైన రాజన్న ఆలయం

- గత జాతరతో పోలిస్తే పెరిగింది
- భారీగా తరలివచ్చిన భక్తులు

వేములవాడ: రాష్ట్రంలోనే అతిపెద్ద శైవ క్షేత్రం దక్షిణకాశీగా పేరొందిన వేములవాడలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత ఘనంగా ముగిశాయి. ఈనెల 25 నుంచి 27 వరకు మూడు రోజులపాటు జరిగిన జాతరకు దాదాపు 4లక్షల మంది వరకు భక్తులు వచ్చారు. భక్తుల ద్వారా రూ.1.31కోట్లు ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. అయితే భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పించలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజన్న జాతర సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు వసతి గదులు లభించలేదు. దీంతో దొరికిన చోటనే సేదతీరారు. దోమలు, చెత్తాచెదారం మధ్యనే మొక్కులు చెల్లించుకుని తిరిగి వెళ్లారు.

జాతర ఆదాయం ఇలా..

ప్రసాదాలు	రూ.57.12 లక్షలు
కోడెమొక్కులు	రూ.45.83 లక్షలు
ఆర్జిత సేవలు	రూ.55 వేలు
కేశఖండనం	రూ.3.89 లక్షలు
శీఘ్రదర్శనం	రూ.6.97 లక్షలు
అతిశీఘ్రదర్శనం	రూ.13.04 లక్షలు
బద్దిపోచమ్మ	రూ.1.91 లక్షలు
నగరేశ్వర	రూ.78 వేలు
వసతి గదులు	రూ.1.05 లక్షలు
ఇతరములు	రూ.62 వేలు
మొత్తం	రూ.1.31 కోట్లు

సంవత్సరం	ఆదాయం
2023	రూ.1.21కోట్లు
2024	రూ.1.20కోట్లు
2025	రూ.1.31కోట్లు

మూడేళ్ల ఆదాయంతో పోల్చితే ఎక్కువ..

ఈసారి మహాశివరాత్రి జాతర ఆదాయం గత మూడేళ్ల ఆదాయంతో పోల్చితే ఎక్కువగా వచ్చింది. గత రెండు జాతరలకు రూ.1.20 కోట్ల వరకు వచ్చింది. ఈసారి రూ.1.31కోట్లు వచ్చింది. జాతర ఉత్సవాలకు సుమారు రూ.2.39 కోట్ల వరకు ఖర్చు చేశాం. హుండీలు లెక్కించలేదు. వాటి ద్వారా మరింత ఆదాయం సమకూరనుంది.

– కొప్పుల వినోద్‌రెడ్డి, ఆలయ ఈవో